# తోటమాలి

రచన :
శ్రీ గొబ్బూరు రాఘవేంద్రరావు, బి.ఎ.

పరీక్షలయిపోయాయి. వేసంగి శెలవలు యిచ్చారు. ఫలితా లొచ్చేవరకు ఏమీ చేయడంలేదు. ఆ తరువాత ఏ యూనివర్సిటీలో వెళ్ళి పోస్టు గ్రాడ్యుయేటు కోర్సు చదవడమో, ఏదో వుద్యోగంలో చేరడమో చెయ్యాలి. నేను యింక పై చదువులు చదవనని బాగా తెలుసు. అందుకనే వేణు నాన్నగారి ద్వారా ఏదన్నా వుద్యోగం సంపాదించాలనే వుద్దేశంతో వూళ్ళ బయలు దేరాను.

వేణు నా ముఖ్య స్నేహితులలో ఒకడు. నా క్లాసు మేటు. వాడూ, నేనూ ఒకే రూములో వుంటూ చదువు కున్నాము. ఇప్పుడు వేణు స్కూటరు కొని, దాని మీద వస్తానని, నన్ను వాళ్ళ గ్రామము వెళ్ళమన్నాడు. మొదట్లో నన్నూ రమ్మంటే నాకు దాని విషయాలేవీ తెలియవని నువ్వు వెళ్ళి తెచ్చుకోమని చెప్పి బయలు దేరాను.

వూళ్ళకు బస్సుమీద రాజమండ్రీ నుంచి బయలు దేరాను. నా సామాను, వేణు సామాను బస్సుమీద వేశాను. రామచంద్రపురంలో బస్సుదిగి బండిపైనో నడిచో వెళ్ళాలి. నాకు బండి ఎక్కడం విసుగు అందుచే సామాన్లు బండిలో పడేసి రెండున్నర మైళ్ళు నడవడం ప్రారంభించేను.

ఒకవైపు ఎండిన పొలాలు, రెండోవైపు నాతో కూడా వస్తున్నట్లున్న కాలువ, నిశ్శబ్దాన్ని చీలుస్తూ వున్న బండివాళ్ళ అదలింపులు, ఎడ్ల మువ్వల చప్పుడు మొదలైనవి ఏదో తెలియని ఆనందాన్ని సమకూరుస్తున్నాయి. ఒక గంటలో నెమ్మదిగా వేణు బంగళా చేరాను.

అది ఆ వూరికి దూరంగా ప్రశాంతతకోసం కట్టినట్లుంది. అసలు ఆ పల్లెటూళ్ళో వున్నవి మొత్తం ఏబది యిళ్ళు కూడా వుండవు. ఇటువంటి ప్రదేశములలో జీవిత కాలమంతా కూడా నివసిస్తే ఎంతో తృప్తిని, హాయిని పొందవచ్చు. గాంధీమహాత్ముని ఆశయం, మన ఆనందం రెండూ తీరేసమయం అప్పుడే కాని ఏ కొందరో తప్ప దాన్ని విస్మరించి, క్షణిక, భౌతిక ఆనందమయిన పట్టణ వాసాన్నే కోరుతారు.

గేటు దగ్గరే తోటమాలి ఎదురై 'దండాలుబాబూ! అబ్బాయి గారేరండి' అని నన్ను పలుకరించాడు.

'అబ్బాయిగారు మోటారు సైకిలు కొనడానికి వెళ్ళాడోయి, రేపొస్తాడు' అని నేను లోపలికెళ్ళాను. తోటమాలి సామాన్లు లోపల పెట్టించాడు. నేను మేడ మీద నున్న జయరావుగారి దగ్గరకెళ్ళేను. నమస్కారం పెట్టి కూర్చున్నాను. 'మావాడు అలా వెళ్ళిపోయాడేమిటోయ్ శరత్' అని అడిగారు. 'అవునండి, రేపు ప్రొద్దున్న వొస్తానన్నాడు' అన్నాను. 'నాలుగు రోజులు నువ్వు యిక్కడే వుండవోయ్. మావాడు యిక్కడ ఏమీ తోచదని గోల పెడ్తూంటాడు. అయినా, వాడికేమి తెలుసు యీ పల్లెటూళ్ళ ప్రకృతి సౌందర్యం' అన్నారాయన.

'రామన్నా' అని కేక వేశారాయన. రామన్న ఆ యింట్లో వంటవాడు. నేను యిక్కడకు రావడం యిది మూడవసారి. ఎంతో ఆదరాభిమానాలతో నన్ను ఆదరిస్తారు యిక్కడ పనిచేసే వాళ్ళు' రామన్న నేను వచ్చినప్పుడల్లా నా కిష్టమైన పదార్థాలు చేసి పెడ్తాడు.

ఈ అబ్బాయిగారికి భోజనం వడ్డించు. మన వేణు రేపు వస్తాడుట రేపు వంట గ్రాండుగా వుండాలి అన్నారు ఆయన. జయరావుగారికి కొడుకుమీద తగని ప్రేమ. భోజనం చేసి కాసేపు ఫాను దగ్గర పడుకొన్నాను.

ప్రయాణ బడలికవల్ల ఎక్కువసేపు నిద్రపోయానేమో. నాలుగు గంటలకు కాని మెలుకువరాలేదు, బాత్ రూములో కెళ్ళి ముఖం కడుక్కొని వచ్చేసరికి టేబిలు మీద ప్లేట్లో పకోడీలు, ప్రక్కనే ఫ్లాస్కులో కాఫీ పోసి వుంచాడు రామన్న. అవి ముగించి, తోటలోనికి వెళ్ళాను. క్రిందటిసారి నేను వచ్చినప్పటి కన్నా, ఎక్కువగా పూల మొక్కలు వేశారు. ఆ వాతావరణంలో మనస్సు తేలికగా అయినట్లుంది. రామారావు చెప్పినట్లు యిలాంటి చోట్ల తిరిగితే కవిత్వంకూడా వస్తుంది. వాడు వాళ్ళ తోటలో కూర్చునే అన్ని కథలు రాస్తుంటాడుట.

తోటమాలి మొక్కలకు నీళ్ళు పోస్తూ 'బాబూ! తోట ఎలావుంది' అన్నాడు. 'తోటకేమోయి, బ్రహ్మాండముగా వుంది. ఈ గులాబీ అంట్లు, సంపెగ మొక్కలు ఎక్కడ నుంచి తెచ్చారు' అన్నాను. తోటలో సుమారు అన్నిరంగుల గులాబీ పువ్వులు నిత్యమూ పూస్తుంటాయి.

'మొన్న సంక్రాంతికి వేణుగారు వచ్చేడప్పుడు 'కడియం' నుంచి కొని తెచ్చారు. ఆయనకు తోటంటే మా చెడ్డ ప్రాణం' అని ఎటో చూడటం మొదలు పెట్టాడు. 'అవును మరి. దానికి తగ్గట్టు వాళ్ళ నాన్నగారు కూడా అతని అచ్చట ముచ్చట తీరుస్తున్నారు. అతనికేం కొరత' అన్నాను.

'అవును బాబూ! పదికాలాలపాటు అలా నేవుండాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను' అన్నాడు గాద్గదిక కంఠముతో. అతని కేసి చూశాను. అతని కళ్ళవెంట కన్నీరు కారుతున్నది. 'అదేమిటి మాలీ! ఎందుకు విచారిస్తున్నావు' అని అడిగాను 'ఏంటీలేదు బాబూ' అని నీళ్ళుపోసేది పట్టుకుని గుడిసేవేపు వెళ్ళాడు. నేను కూడా అతన్ని అనుసరించి, లోపలకు వెళ్ళాను.

'కూర్చోండి' అన్నాడు. నేను అక్కడవున్న కావడిపెట్టెమీద కూర్చున్నాను. 'కూర్చో' అన్నాను. 'పరవాలేదు' అని నుంచునే కళ్ళు వత్తుకుంటున్నాడు.

'ఏమిటో విషయం వుంది. నాతో చెప్పకూడదా' అన్నాను. ఏంలేదు బాబు. ఏవో పాత సంగతులు జ్ఞాపకమొచ్చాయి. అంతే' అన్నాడు. నేను నమ్మలేదు.

'పాత స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకొని విచారించటం అవివేకం. ఆ కష్టాలు ఒకరితో చెప్పుకుంటే మనస్సాంతైనా లభిస్తుంది. ఫరవాలేదు. నాతో చెప్పు. నేను నీ కొడుకులాంటి వాణ్నే' అన్నాను. తోటమాలితో యింత సన్నిహితంగా యిదే మొదటిసారి మాట్లాడడం. ఆ మాటలతో యింక ఆగలేక బావురుమన్నాడతను.

ఆ తరువాత నెమ్మదిగా అడుగగా యిలా చెప్పాడు. అతనికి యిరువది సం॥ల వయ్యసులోనే పెళ్ళి అయిందట వాళ్ళు కోడూరులో కాపురం పెట్టిన రెండేళ్ళకు ఒక ఆడ పిల్ల కలిగిందట. మరియొక మూడు సం॥లలోనే ఒక పిల్లవాడు, తరువాత యింకో మగ పిల్లవాడు పుట్టారుట, అప్పుడే జయరావుగారి భార్య వాళ్ళ బంధువు వింటికి కోడూరు వచ్చిందిట. ఆవిడకి ఎంత కాలానికి పిల్లలు కలుగలేదు. పుత్రులు లేకపోతే వంశం వుండదు. ముఖ్యంగా తమ ఆస్థికి వారసులు లేరు. అందుకని మంచి మగ పిల్లవాడిని పెంచుకుంటానని అనుకున్నారుట జయరావుగారు కూడా దీనికి ఒప్పుకున్నారు. అప్పుడు యీ తోటమాలికి పుట్టిన ఆఖరు కుమారుణ్ణి తెచ్చుకున్నారుట. ఆ తల్లి దండ్రులు కూడా పిల్లవాడి భవిష్యత్తును గొప్పగా వూహించి ఒప్పుకున్నారు. కాని విధి నిర్దయచే మశూచి వచ్చి తోటమాలికి కల్గిన తక్కిన యిద్దరు పిల్లలు పోయారుట మళ్ళీ తమ బిడ్డని యిమ్మని అడగలేదు. ఎక్కడయితేనేం సుఖంగా వుండాలని వూరుకున్నారుట. కొన్నాళ్ళకి బెంగతో అతని భార్య కూడా పోయిందట. అప్పుడు అతను యిక్కడకు వచ్చేసి యీ పని చేసుకుంటూ వున్నాడుట.

'అంటే వేణు నీ కొడుకన్నమాట' అన్నాను ఆశ్చర్యంగా. 'బాబూ అది మీ మనస్సులోనే పెట్టుకోండి. వేణుగారికి తెలియకుండా యింతవరకు తీసుకువచ్చాను' అని ప్రాధేయ పూర్వకంగా అడిగాడు. 'సరే' అని నేను బయటకు వచ్చేసాను.

× × ×

మర్నాడు నేను నీళ్ళు పోసుకొని, డ్రెస్ వేసుకునే వేళ్ళకి క్రొత్త స్కూటరు మీద వేణు వచ్చాడు. 'ఎలావుంద' అన్నాడు, 'దానికేం నువ్వు సెలక్టు చెయ్యడం, బాగులేక పోవడమూనా చాలా బాగుంది.' అన్నాను. అతని కళ్ళల్లోకి సూటిగా చూశాను. తోటమాలి కళ్ళల్లోని దైన్యంకు బదులు, అహంకారం, దర్పం కనిపిస్తున్నాయి.

'ఏమిటలా చూస్తున్నావు' అన్నాడు వేణు. 'ఏమిలేదు నీలో వుండే అందాన్ని పరిశీస్తున్నాను' అన్నాను నవ్వుతూ.

ఆరోజు రామన్న చేతిలోని మహిమవలననో, వేణు వచ్చాడన్న ఆనందము వలననో కొత్త పదార్థాలను రుచిగా చేశాడు. అవి అన్నీ తినేసరికి (నాకు పెట్టినవి) కడుపు ఖరీ అయింది. దానికి నిద్రే మంచి మందు. వేణూ-నేను మా రిజల్ట్సు గురించి స్నేహితులను గురించి మాట్లాడాము. తను నిన్న బెజవాడలో బెన్ హూరు చూశానని, అది చాలాబాగుందని యింకా ఏదో చెప్తు

న్నాడు. ఈ లోగానే నన్ను నిద్రా దేవత తన కరుణామయ చేతుల్లోకి నన్ను లాక్కుంది.

నేను లేచేసరికి మధ్యాహ్నం మూడున్నరయింది. ఆ రోజు జయరావుగారు పనుందని కాకినాడ వెళ్ళారు. రెండు రోజుల్లో వస్తానని నన్ను వుండమన్నారు. నేను లేవకముందే వేణు లేచాడు. ఒక గంటలో మేము టిఫిను, కాఫీ ముగించి టాయిలెట్ చేసుకుని రడీ అయ్యాము. తిరగడానికి, నడచి వెళ్దామని నేనంటే, స్కూటరు మీద వెళ్దామని బయలు దేరాడు వేణు.

పల్లెల అందం చూడాలిగాని చెప్పలేము. సాయంకాలం 5 గం॥ వేళ సూర్యుడు పడమటి కొండలలోకి దిగజారుతుంటే, పక్షులు తమతమ గూళ్ళకి పిల్లలకు ఆహారము అందించాలని జేరుతున్నప్పుడు ఆకాశం బాగుంటుంది. మా స్కూటరు అలా కాలవగట్టువైపు పోనిచ్చాడు. అక్కడ కాలవగట్టు మీదనుంచి చల్లటిగాలి వస్తూ నాహృదయాన్ని కవిత్వధోరణిలోనికి లాగుకొని పోతూంది. మా బైక్ చప్పుడును వింతగా చూస్తున్నాయి చెట్లమీద పక్షులు. రోడ్డుమీద వెళ్తున్న గొర్రెలమంద బెదరి చెల్లాచెదురుగా అయిపోయాయి. 'ఇంక వెనుకకు మళ్ళుదాము' అన్నాను. 'సరే' నని స్కూటరును వెనుకకు త్రిప్పాడు.

అప్పటికే సూర్యాస్తమయము అయింది. సూర్యుడు పడమటి కొండల చాటున వున్న నది లోనికి పడినప్పుడు, దానిలో నుంచి వచ్చిన తుంపరలుగా నక్షత్రాలు నింగిపై నిలచాయి. చంద్రుని కమ్మని వెన్నెల చీకటి పడినట్లు తెలియజేయటంలేదు. బంగళా దగ్గరకు వెళ్ళేటప్పటికి, స్కూటరు చప్పుడుకు తోటమాలి వచ్చి గేటు తలుపు తెరచాడు. లోపలికెళ్ళి దానిని స్టేండువేసి లోపలికెళ్ళాము.

నేను ముందు డ్రెసువిప్పుకొని, లుంగీ కట్టుకొని బాత్ రూముకు వెళ్ళాను. వున్నట్లేవుండి దీపాలారిపోయాయి. నేను బాత్ రూములోనుంచి బయటకు వచ్చేసరికి పెద్ద చప్పుడు వినిపించింది. స్కూటరు క్రిందపడిపోయియుంటుంది, వేణు బయటకు పరుగెత్తాడు.

తోటమాలి నేలమీదనుంచి భయంగా చూస్తున్నాడు. దీపాలు వెలిగాయి. 'ఏమిటిది' అన్నాడు వేణు కోపంగా 'బాబూ! లైట్లు ఆరిపోయాయి, యింట్లో చీకటిగా వుందని దీపము వెలిగిద్దామని వస్తూ, కళ్ళు కనిపించక దీని మీద పడ్డాను' అన్నాడు.

స్కూటరు పడి అక్కడే వున్న కడియం సంపంగి మొక్క విరిగి పోయింది. అది యింకొక రెండేళ్ళకు పూవులు పూస్తుంది. వేణుకు క్రొత్త స్కూటరు క్రింద పడి, సంపంగి మొక్క విరిగి పోయేసరికి అపరిమితంగా కోపం వచ్చింది. తమాయించుకోలేక పోయాడు.

'గ్రుడ్డి వెధవా! అంత కళ్ళు మూసుకొని నడుస్తున్నావా' అని తోటమాలిని చెంపకాయ కొట్టి, చేత్తో తోసేసాడు. అతను క్రిందపడ్డాడు. గులాబీ ముళ్ళు వంటి నిండా గీసుక పోయాయి. ఆ క్షణంలో నాహృదయం బ్రద్దలయినట్లయింది.

'వేణూ' అని నేను వెళ్ళి, వేణును పట్టుకున్నాను. కోపంలో యింకాయేమి చేస్తాడోనని. ఇద్దరం కలిసి స్కూటరును ఎత్తి నిలబెట్టాము. 'ఇలా రా' అన్నాను వేణుని నేను.

'బాబూ ఏదో తప్పు చేశాను. నన్ను క్షమించండి' అంటూ నాకేవి చెప్పొద్దు అన్నట్లుగా చూశాడు. 'మాలి నువు వెళ్ళు' అని నేను వేణుని లోపలకు తీసుకెళ్ళాను.

"నువ్వేమిటి శరత్! పనివాళ్ళను వాళ్ళహద్దుల్లో వుంచకపోతే మితిమీరి పోతారు. నువ్వాపావుగాని లేకపోతే......" అన్నాడు. "అటువంటప్పుడే ఓర్పు వహించాలి. కాసేపు పోయాక నీమనస్సుకు నీకే చేసిన తప్పు తెలుస్తుంది. అందరూ తప్పులుచేస్తుంటారు. కానీ దాన్ని ఓర్పుతో సహించి చూడగలవాడే మనిషి. నామాటలకు నీకు కోపం రావచ్చు." అన్నాను. "కోపములేదు" అన్నాడు సమాధానంగా.

ఇద్దరం భోజనముచేసి పడుకున్నాము. వేణుకి కాసేపటికి నిద్రపట్టేసింది. కానీ నాకు ఆలోచనలతో నిద్రపట్టడంలేదు. ఏవిషయం తెలియకుండా వుండాలేగాని, తెలిసిందో, ఆ విషయానికి సంబంధించినది బాధాకరంగా తెలిసినా మనసు కలతచెందుతుంది. అలాగే అయింది నాకు.

మెల్లిగా లేచి తోటలో వున్న గుడిసెవద్దకు వడిచాను. అక్కడ గ్రుడ్డి వెలుగు దీపపు కాంతిలో మాలి ముఖం స్పష్టంగా కనిపిస్తూంది. ఆ వెలిగే దీపం మాన్లర

విలువలను తెలియచెప్పుతోంది. చమురు తక్కువగా వున్నప్పుడు కాంతి తగ్గినట్లే, మానవుని ధనమున బట్టే సంఘంలో గౌరవం కూడాను. ఆ చమురే ఎక్కువగా వుంటే ఆ కాంతి అనగా గౌరవము పెరుగుతుంది అనే నగ్న సత్యాన్ని ఈ చిన్న దీపం చాటుతోంది.

మాలి ముఖంలో జీవం లేదు. నన్ను చూచి మాలి కన్నీరు కార్చడం మొదలు పెట్టాడు. "విచారించి లాభం లేదు మాలీ! అంత పని చేస్తాడని నేను అనుకో లేదు" అన్నాను. వంటిమీద గులాబీ ముళ్లు గీసుకున్న చోట రక్తపు గీతలు కనిపిస్తున్నాయి. తనకు జీవం యిచ్చిన రక్తాన్నే కళ్ళచూశాడు వేణు. ఆక్షణంలో వేణు నాకొక క్రూరమృగంలా కనిపించాడు. కానీ అతని తప్పేమీ లేదు, ధన అహంకారం అలాంటిది. తను ఈ తోటమాలి కొడుకునని తెలిస్తే? అలా కాకూడదు. అప్పుడు నీగురించి మరో హృదయం ఘోషిస్తుంది.

"బాబూ! రహస్యం తెలినీయకండి. నన్ను కాపాడండి" అన్నాడు.

"అంత మూర్ఖంగా ప్రవర్తిస్తాడని నేను అనుకోలేదు. నువ్వు మనస్సులో ఏమీ బాధపెట్టుకోకు" అన్నాను బాధగానే.

"బాధేమిటి! యింక ఈ జీవి ఎప్పుడో కష్టాలకు అంకితమై పోయింది" అన్నాడు. అప్రయత్నంగా నాకళ్ళు కూడా చెమ్మగిల్లాయి. ఇక అక్కడ వుండలేక లోపలకు వచ్చి పడుకున్నాను.

× × ×

తెల్లవారింది. బాల భాను్యని కాంతి కిరణములు కిటికీ లోంచి వచ్చి నన్ను తట్టి లేపాయి. బయట కాకులు "తెల్లవారింది, లేవండి" అని అన్నీ తెలిసిన మనుష్యులకు చెబుతున్నట్లు అరుస్తున్నాయి. వేణు కూడా యింకా లేవలేదు. అప్పటికే $6\frac{1}{2}$ గం॥ అయింది.

లేవవలసిన ముఖ్యావసరము వుంటే దానంతట అదే మెలుకువ వస్తుంది. పరీక్ష రోజుల్లో మాకు అసలు నిద్ర పట్టలేదు. కానీ ఏమీ పనిలేకపోతే మెలుకువరాదు.

నేను లేచి వేణుని లేపాను. ఇద్దరం ముఖం కడుకుని కాఫీ త్రాగాము. నిన్న వచ్చిన యింగ్లీషు పేపరు మాస్తూ కూర్చున్నాము. మాటల సందర్భములో రామన్న వచ్చి అన్నాడు.

"బాబూ! తోటమాలికి జ్వరం వచ్చినట్లుంది. ఒళ్ళంతా తెగ కాలిపోతోంది" అన్నాడు.

"కదలక నిర్మలంగా వున్న నీటిలో రాయి వేసినట్లు నా మనస్సు కలుక్కుమంది" నువ్వు వెళ్ళి మన ఆయుర్వేదం డాక్టరువద్ద మందు తీసుకువచ్చి వెయ్యి. కంట ఆలస్యమైనా ఫరవాలేదు" అన్నాడు వేణు. రామన్నతో. "అట్లాగే బాబూ" అని రామన్న కాఫీ త్రాగిన కప్పులను లోపల పెట్టి బయటకు వెళ్ళాడు.

'ముసలివాడు, ఒక్కసారి వెంబెలెత్తిపోయాడు' అన్నాను. వేణు మాట్లాడలేదు.

నేను పేపరు చదువుతూ కూర్చున్నాను.

"బాబూ; ఆయన ఏదో మందు పొట్లాలు యిచ్చారు. అవి యిచ్చాను వేసుకోమని. తెలివికూడా లేనట్లు పడుకున్నాడు" అన్నాడు రామన్న. వెంటనే నేను లేచి వేణూ! ఒకసారి వెళ్ళివద్దాం రా" అని నేను లోటలోనికి నడిచాను. నా వెనకాలే వేణు కూడా వచ్చాడు.

ఒంటిమీద చెయ్యి వేసి చూశాను. ఒళ్ళు సలసల మరిగిపోతూంది. "మాలీ ఎలా వుంది" అన్నాను.

"బాబూ కొద్దిగా జ్వరం వచ్చింది" అని లేవబోయాడు. "లేవకు పడుకో రామన్న తీసుకొచ్చినవి వేసుకొన్నావా" అని అడిగాను. వేసుకొన్నానని తలవూపాడు. వేణు ఏదో పోయిన వస్తువు తెచ్చుకుందామన్నట్లు చూస్తున్నాడు.

"నాకు సాయంకాలానికి నయమయి పోతుంది బాబూ! అప్పుడు జాగ్రత్తగానే మొక్కలికి నీళ్ళు పోస్తాను" అంటున్నాడు వేణుతో కళ్ళుమూసుకునే. బహుశా వేణుకి హృదయమున్నట్లయితే, యీ మాటలకు జాలికలిగి వుంటుంది.

"నువ్వేమి చెయ్యక్కర్లేదు. కానీ జాగ్రత్తగా మందు వేసుకొని పడుకో" అన్నాడు వేణు. రాత్రి నామాటలని అర్థం చేసుకొని వుంటాడు అనుకోన్నాను.

ఇద్దరం బయటకి వచ్చేశాము రామన్న కనిపించాడు అక్కడ. "నువ్వు కొంచెం వీడిని కనిపెడుతూవుండు" అన్నాడు వేణూ.

"అలాగే బాబూ!"

నేను స్నానం చేసివచ్చి "దినపత్రిక" తిరగేస్తు

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

న్నాను వేణు కూడా నీళ్ళుపోసుకునేందుకు వెళ్ళాడు. అప్పుడే రాజారావుగారు వచ్చారు'' ఏమిటి రెండురోజు లుంటానని - అప్పుడే వచ్చేశారు'' అన్నాను.

''వెళ్ళినపని నిమిషాలమీద అయిపోయింది. ఇంకో సంగతేమిటంటే అక్కడ నాకు తెలిసిన ఒక మిత్రుడి కంపెనీలో అసిస్టెంటు మేనేజరు పోస్టు ఖాళీగావుందిట. తప్పకుండా నిన్ను వేసుకుంటానన్నాడు. నీవు రేపే బయలుదేరి వెళ్ళి అతన్ని కలుసుకో'' అని అతని ఎడ్రసు వున్న కాగితం యిచ్చారు.

''చాలా థాంక్సుసార్. నామీద చాలా అభిమానము చూపిస్తున్నారు'' అన్నాను. నాకు వుద్యోగం వస్తున్నందుకు నాకు సంతోషము ఎక్కువయింది. నేను ఒక స్వేచ్ఛాజీవిగా అవుతానన్న మాట.

''తోటమాలి కన్పించడేమిటి'' అన్నారు జయరావుగారు. అప్పుడే బాత్ రూములోనుంచి వస్తున్న వేణు'' వాడికి జ్వరం వచ్చింది నాన్నగారు, రామన్న మందు తెచ్చాడు.'' అన్నాడు అసలు విషయం కప్పిపుచ్చుతూ.

''ఏమిటి ఆ డాక్టరు మందా! వాడి మందు వైకుంఠ యాత్ర. ఎక్కువ జ్వరంగావుంటే ప్రక్కవూరులో మంచి వైద్యుడున్నాడు. వాడిదగ్గరకెళ్ళి మందు తీసుకు రండి. వుందిగా మీ వాహనం'' అన్నారాయన నవ్వుతూ ఆయన ముఖంలో కల్మషం లేదు. ఎప్పుడూ సరదాగా వుండటానికి ప్రయత్నిస్తారు. ఆయన మాలియందు తీసుకొంటున్న శ్రద్ధచూస్తే, న్యాయం ధర్మ అనేది బాగా తెలుసునని అనిపిస్తుంది. ''అలాగేనండి'' అని నేనే అన్నాను. భోజనం చేసి బయలుదేరాము.

బలవంతముమీద వచ్చినట్లే వేణుకూడా వచ్చాడు. 11 గం॥ లే ఎండబాగా నేవుంది. అప్పుడప్పుడు మబ్బు సూర్యుడికి అడ్డువచ్చి మాకు గొడుగు పట్టి నీడనిస్తున్నాడు. ఇద్దరం కూలింగు గ్లాసెను పెట్టికొని వెళ్తున్నాం ప్రక్కవూరు నాలుగు మైళ్ళదూరం. అక్కడ ఆవైద్యుడింటికి వెళ్ళాము. అంతకుముందు అది మాకు తెలుసు. ఆయన యింట్లోలేరు. ఎవరికో జబ్బుగావుంటే మైలు దూరంలో వున్న యింటికి వెళ్ళారుట. సుమారు గంట సేపు కూచున్నాము. వెళ్ళిపోదామన్నాడు. వేణు. ఇంకొంత సేపుచూచి పోదామన్నాను. ఈ లోగా ఆయన వచ్చాడు. వచ్చినపనిచెప్పాము. ఆయన మందేదో యిచ్చి, ''ఈస్లీపింగు పిల్సు కూడా యివ్వండి. నిద్రపోతే మంచిది'' అన్నారు. సరేనని అవి తీసుకుని బయలుదేరాము.

ఇంటికి జేరుకునే సరికి రెండయింది. మా బైక్ చప్పుడు విని గేటు రామన్న తెరిచాడు. వాడు ఎందుకనో ఏడుస్తున్నట్లున్నాడు. నాకు చెయ్యి వణికినట్లయింది. ఇద్దరమూ బైక్ దిగేసరికి జయరావుగారు. వచ్చి ''యిద్దరూ లోపలకు వెళ్ళండి, జరగవలసినదేదో భగవంతుడే జరిపించాడు. తోటమాలి అరగంట క్రితమే చనిపోయాడు'' అన్నారు. నాగుండెల్ని గునపంతో ఎవరో పెళ్ళగించారు. చేతులోని మందు సీసా క్రిందపడిపోయింది. మాట్లాడలేకపోయాను. ఏమి మాట్లాడగలను. ఒకసారి వెళ్లిచూస్తానన్నాను. వెళ్ళమన్నారాయన, అమంచం మీదే శాశ్వతంగా నిద్రపోతున్నాడు మాలి. ఆకళ్లు మూసుకొని ఏదో పరమార్థం గురించి ఆలోచిస్తున్నట్లుంది. అక్కడ నేలమీద రామన్న తెచ్చిన మందు పొట్లాలున్నాయి. జయరావుగారన్నమాట జ్ఞాపకమొచ్చింది. వాడిమాత్ర వైకుంఠయాత్ర ఆ యాత్రలోని దోషాన్ని శంకించలేను.

కొందరు తప్పులుచేసి దాని శిక్షను అనుభవిస్తారు. గానీ తప్పులు చెయ్యకుండా వుపకార బుద్ధి కలవారు కూడా శిక్ష అనుభవించవలసివస్తుంది. అటువంటప్పుడు వుపకారమే తప్పన్నమాట. నా వెనకాలేవచ్చి భుజముమీద చెయ్యివేసి అన్నారు జయరావుగారు. ''శరత్! ఏమిటి ఆలోచిస్తున్నావు. అతనికి భూమిమీద ఋణం తీరిపోయింది. అంతే. అతను ఒక విధంగా దురదృష్టవంతుడేమోననపిస్తుంది'' అన్నారు. వెంటనే నేను ఆయనకేసి చూశాను. ఆయన అన్న మాటలోని పరమార్థం నాకు తెలుసునని ఆయనకు తెలియదు.

మర్నాడు నేను కాకినాడ బయలుదేరాను. వేణుమీద నాకెందుకో కోపం, జాలికూడా కలిగాయి. అతను చేసినది తెలియకచేసిన నేరం. దానికి అతను బాధ్యుడు కాదు. నేను అసలు విషయం చెప్పినా దానివలన అతని బాధ కలుగవచ్చునేమో కాని, యికచేసేదేమీలేదు. అందుకని అనిగూఢ సత్యాన్ని నేనుకూడా శివుడు హాలాహలాన్ని దాచుకున్నట్లు దాచేసి, వీలైతే మర్చిపోవడం మంచిది. తన కొడుకుమీద ఆపేక్షతో పరమరహస్యాన్ని కప్పిపుచ్చిన తోటమాలి ధన్యుడు.

నాతో వేణుకూడా కాకినాడవస్తానన్నాడు. ఒక గుర్రపు బండిని మాట్లాడి అందులో సామాను వేసి, స్కూటరుమీద బయలుదేరాము. తోటలోని పువ్వుల మొక్కలు గాలికి, తలలు ఆడించి నాకు వీడ్కోలు యిస్తున్నాయి. నిర్జనంగావున్న పూరిగుడిసె నాకేసే చూస్తోంది. బాధగా, బరువుతో తోటనుంచి నిష్క్రమించాను.